క్లుప్తంగా

దొడర్న సబ్‌స్టేషన్‌కు నిధులు మంజూరు

భైంసాటౌన్/కుభీర్: కుభీర్ మండలంలోని దొడర్నలో 33/11కేవీ సామర్థ్యంతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం రూ.3.54 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ వినియోగంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసినందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సంబంధిత శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి

భైంసాటౌన్: నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు పటేల్ అన్నారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. తాను పార్టీ మారుతున్నట్లు ఇటీవల ప్రచారం జరుగుతోందని, అటువంటి ఆలోచన లేదని స్పష్టం చేశారు. పార్టీలోని ఓ వర్గం తాను బీఆర్ఎస్‌లో చేరతానని దుష్ప్రచారం చేస్తోందన్నారు. తాను బీజేపీలోనే ఉంటానని, వచ్చే అసెంబ్లీ, లేదా పార్లమెంట్ ఎన్నికల బరిలోనూ పోటీలో ఉంటానని చెప్పారు. ఇప్పటికే పల్లె పల్లెకూ బీజేపీ–గడప గడపకూ మోహన్‌రావు పటేల్ కార్యక్రమంతో నియోజకవర్గంలో బీజేపీని ఇంటింటికీ తీసుకెళ్లానని గుర్తు చేశారు. పార్టీ బలోపేతం కోసం నిస్వార్థంగా పనిచేస్తున్నానన్నారు.

ముగిసిన ఆర్టీసీ వన భోజనాలు

నిర్మల్‌టౌన్: ఆర్టీసీ డిపోలో రెండు రోజులు నిర్వహించిన కార్తిక వన భోజనాలు బుధవారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ ఆర్ఎం(మెకానిక్)ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. ఆర్టీసీ సిబ్బందితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్లు రాజశేఖర్, నవీన్‌కుమార్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారం చెక్కులు అందజేత

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ గ్రామానికి చెందిన సబ్బని లక్ష్మణ్ గేదె దూడ, కొంచెపు సాయన్నకు చెందిన కోడె దూడ ఇటీవల పెద్దపులి దాడిలో మృతి చెందాయి. బుధవారం నిర్మల్‌లో జరిగిన కార్యక్రమంలో బాసర సర్కిల్ కన్జర్వేటర్ శర్వాణన్ బాధిత రైతులకు పరిహారం చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో నాగిని భాను, ఎఫ్ఆర్వో వేణుగోపాల్, ఎఫ్ఎస్‌వో కీర్తిరెడ్డి, ఎఫ్‌బీవోలు హరిలత, ముస్తాక్, మహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

యువతి వివాహానికి చేయూత

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన మున్సిపల్ కార్మికుడు దర్శనాల లక్ష్మి–రాజేశ్వర్ దంపతుల కూతురు వివాహానికి మాజీమంత్రి ఐకేరెడ్డి పీఏ కృష్ణంరాజు పుస్తె, మెట్టెలను అందజేశారు. బుధవారం పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో గల సంబంధిత కుటుంబ సభ్యులకు కృష్ణంరాజు ఆదేశంతో ఓకేఆర్ ఫౌండేషన్ సభ్యులు పుస్తె మెట్టెలు అందజేశారు.

'విఠల్‌రెడ్డిపై విమర్శలు సహించేది లేదు'

భైంసాటౌన్: మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు విఠల్‌రెడ్డిపై విమర్శలు చేస్తే సహించేది లేదని ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఏఎంసీ సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు. విఠల్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతుంటే ఈర్ష్యతో విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ ఫారూక్ అహ్మద్, నాయకులు రాజన్న, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మల్లన్న జాతర

సోన్: మండలంలోని న్యూ బొప్పారంలో గురువారం మల్లన్న జాతర నిర్వహిస్తున్నట్లు యాదవ సంఘం కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం మహిళలు డప్పుచప్పుళ్లు, భాజాభజంత్రీల మధ్య గంగ నీళ్లు తీసుకువచ్చి మల్లన్న ప్రతిమలను శుద్ధిచేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు మధుకర్ యాదవ్, మహేష్ యాదవ్ మల్లయ్య యాదవ్, మహేందర్ యాదవ్, మహిళలు పాల్గొన్నారు.

విజయలక్ష్మి నిజాయతీ

బాసర: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్న సుమలత బుధవారం వారసంతకు వెళ్లి రూ.20వేల విలువైన సెల్‌ఫోన్ అక్కడే మర్చిపోయింది. తాండూర్ మండలం కోలూరు గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపా రి విజయలక్ష్మికి ఫోన్ దొరకడంతో తిరిగి సుమలతకు అప్పగించింది. ఉపాధ్యాయురాలితో పాటు స్థానికులు సదరు మహిళను అభినందించారు.



కల్లూరులోని సాయిబాబా ఆలయం

మహిమాన్వితం... సాయి పుణ్యక్షేత్రం

- మరో షిర్డీగా కల్లూరు సాయిబాబా ఆలయం
- దత్తజయంతి ఉత్సవాలకు ముస్తాబు

కుంటాల: మండలంలోని కల్లూరులో వెలసిన సాయిబాబా ఆలయం అభినవ షిర్డీగా విరాజిల్లుతోంది. దాతల సహకారంతో 18 ఏళ్ల క్రితం రూ.కోటి 25 లక్షల వ్యయంతో షిర్డీ తరహాలో ఆలయాన్ని నిర్మించారు. భక్తులు కోరిన కోర్కెలు నెరవేరుతుండడంతో ప్రతీ గురువారం, పండుగ పర్వదినాల్లో సాయి పుణ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడుతుంది. ఈ నెల 7న దత్త జయంతి సందర్భంగా 15 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

ధూని మందిరం..

ఆలయం పక్కనే ఉన్న ధూని మందిరం నిరంతరం వెలుగుతూనే ఉంటుంది. అల్లుబండ పైన వేళ్లపెట్టి తిరగడంతో కోరికలు నెరవేరుతాయని భక్తులు విశ్వసిస్తారు. పెద్ద బండరాయికింద నుంచి దూరడంతో మంచి జరుగుతుందని భావిస్తారు.

నిత్యాన్నదానం

ఆలయంలో భక్తులకు నిత్యాన్నదానం చేస్తారు. వృద్ధుల కోసం 15 ఏళ్ల క్రితం వృద్ధాశ్రమాన్ని నెలకొల్పారు. ఉదయం అల్పాహారం, రెండు పూటల భోజన వసతి ఏర్పాటు చేస్తారు.

షిర్డీ తరహాలో ఆలయ నిర్మాణం

కరీంనగర్‌కు చెందిన ప్రభాకర్ మహారాజ్ దాతల సహకారంతో కల్లూరు సాయిబాబా ఆలయాన్ని షిర్డీ తరహాలో నిర్మించారు. ఇందుకు సుమారు 30 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. అనారోగ్యంతో ప్రభాకర్ మహారాజు మృతి చెందడంతో రూ.7లక్షల వ్యయంతో ఆయన పేరుతో ధ్యాన మందిరం నిర్మించారు. ఏటా పుణ్యతిథి నిర్వహిస్తారు. దాతలు ఇచ్చిన ఆవులు, గేదెల పాలతో సేంద్రియ ఎరువులు తయారు చేస్తారు.

41 ఏళ్లుగా జ్వలిస్తున్న నందదీపం

సికింద్రాబాద్‌కు చెందిన ఉమామహేశ్వర్ సాయిబాబా ఆలయానికి వచ్చి పూజలు చేయగా అతను కోరిన కోర్కెలు నెరవేరాయి. దీంతో 1983లో నంద దీపాన్ని ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలోని పరిడసింగ్ గ్రామానికి చెందిన భక్తురాలు సతీ అనసూయ మాత దీపాన్ని వెలిగించారు. 41 ఏళ్లుగా నందదీపం జ్వలిస్తూనే ఉంది. పక్కనే ఉన్న సత్యనారాయణ స్వామి మండపంలో పంటలు బాగా పండాలని కోరుతూ రైతులు మృగశిర కార్తెలో సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తారు.

ప్రత్యేక ధ్యాన మందిరం

షిర్డీకి చెందిన శివనేశ్వర్ స్వామి పేరిట ధ్యాన మందిరం నిర్మించారు. విద్యార్థులు చదువులో రాణించాలని, కుటుంబాలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ ధ్యాన మందిరంలో సాయిబాబా చరిత్ర, గురు చరిత్ర, దత్త పారాయణం చేస్తారు.

'ధరణి' సమస్యలు పరిష్కరిస్తాం

లోకేశ్వరం: ధరణిలో నెలకొన్న భూసమస్యలు దశల వారీగా పరిష్కరిస్తామని భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సమగ్ర సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. సుద్ద వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోతీరాం, డీటీ రవీందర్, ఆర్ఐ బాలకిషన్, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో కోమల్‌రెడ్డి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

భైంసాటౌన్: అపరిచిత మెసెజ్‌లు, కాల్స్‌కు స్పందించవద్దని పట్టణ సీఐ గోపినాథ్ సూచి ంచారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగ ంగా పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో బు ధవారం విద్యార్థినులకు అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. బాలికలు ఇంటా, బయటా వేధింపులకు గురైతే 100కు డయల్ చే యాలని, సైబర్ నేరాలపై సైతం అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎండీ గౌసుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుంటాల: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై భాస్కరాచారి అన్నారు. కుంటాల ఆదర్శ పాఠశాల విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్ కుమార్, ఏఎస్సై జీవన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ గోపినాథ్

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపాలి

- హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సంఘీభావ సభ

నిర్మల్‌చైన్‌గేట్: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపాలని హిందూ ఐక్యవేదిక సభ్యులు కోరారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట బుధవారం సంఘీభావ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇస్కాన్ ప్రతినిధి చిన్మయ్ కృష్ణదాస్‌ను జైలు నుంచి విడిపించాలని డిమాండ్ చేశారు. శాంతియుత నిరసనల్లో హిందువులకు నాయకత్వం వహిస్తున్న ఇస్కాన్ సన్యాసి చిన్మయ్ కృష్ణదాస్‌ను అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ఈ క్లిష్ట సమయంలో భారత దేశం, గ్లోబల్ కమ్యూనిటీ సంస్థలు, ప్రపంచ మానవ హక్కుల సంఘం తక్షణం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ్ చాలక్ నూకల విజయ్‌కుమార్, నగర సంఘ చాలక్ ప్రమోద్ చంద్రారెడ్డి, విభాగ్ సామాజిక సమరసత ప్రముఖ్ అల్లాడి సూర్యనారాయణ, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు జాదవ్ విఠల్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, రావుల రాంనాథ్, హిందూ వాహిని జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల హరీశ్, తదితరులు పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న హిందూ ఐక్యవేదిక సభ్యులు

చెరువు తూము పరిశీలన



పరిశీలిస్తున్న అధికారులు

కుంటాల: మండలంలోని వెంకూర్ చెరువు నిర్మించిన ఏడాదికే తూము కొట్టుకుపోయింది. దీంతో బుధవారం ఇరిగేషన్ ఆదిలాబాద్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ పరిశీలించారు. తూము నిర్మాణానికి అవసరమయ్యే నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపిస్తామని వెల్లడించారు. ఆయన వెంట ఎస్ఈ రవీందర్, ఈఈ అనిల్, ఏఈఈ మిరాజొద్దీన్ ఉన్నారు.

7 నుంచి సీఎం కప్ పోటీలు

మామడ: గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సీఎం కప్ పోటీలు నిర్వహిస్తోందని ఎంపీడీవో సుశీల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ స్థాయిలో ఈ నెల 7 నుంచి 12 వరకు వాలీబాల్, అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈనెల 5 వరకు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి గంగాసాగర్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలు

ఖానాపూర్: ప్రజాపాలన విజయోత్సవాలను ముగించుకుని మున్సిపల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, శంకర్, సంతోష్, కమిషనర్ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల పాలనలో ఎందుకు పట్టించుకోలేదు?

లక్ష్మణచాంద: పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కేజీబీవీలను ఎందుకు పట్టించుకోలేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వొడ్నాల రాజేశ్వర్ ప్రశ్నించారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉండగా కానరాని సంక్షేమ వసతి గృహాలు అధికారం కోల్పోయాక గుర్తుకు వచ్చాయా అని అన్నారు. ఇటీవల కేజీబీవీని సందర్శించిన కలెక్టర్ అభిలాష అభినవ్‌ను విద్యార్థులు డైనింగ్ హాల్ నిర్మించాలని కోరడంతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు ప్రత్యేక చొరవతోనే మండలానికి 108 అంబులెన్స్ కూడా మంజూరైందన్నారు. సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్, నాయకులు బిట్లింగ్ రజనీకాంత్, సురేష్, నాగేష్, వినేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు

లక్ష్మణచాంద: ఆర్టీసీ అధికారులు బుధవారం మండలంలోని పీచరలో దివ్యాంగులకు ఉచిత పాస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నర్సరీ పనులు ప్రారంభించాలి

తానూరు: ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో నర్సరీ పనులను ప్రారంభించాలని ఎంపీవో నసీరొద్దీన్ సూచించారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాల ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

సోన్: మండలంలోని పాక్‌పట్ల ఉన్నత పాఠశాలలో భరోసా, షీ టీమ్స్ ఆధ్వర్యంలో రక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాజాత బృందం సభ్యులు మహిళలపై జరుగుతున్న నేరాలను పాటల రూపంలో వివరించారు.

సంక్షిప్త వార్తలు

సరస్వతి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

కుంటాల: కుంటాల ఉన్నత పాఠశాలలో చదివిన 2004–05 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు రూ.లక్ష వ్యయంతో సరస్వతీ మాత విగ్రహం ఏర్పాటుకు ముందుకు వచ్చారు. బుధవారం పాఠశాల ఆవరణలో విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ముత్యం, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: మతిస్థిమితం కోల్పోయిన ఓ మహిళ మూడురోజులుగా ఒంటిపై దుస్తులు లేకుండా పట్టణంలో తిరుగుతోంది. పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు మహిళా ఎస్సై బిట్ల పెర్సిస్ బుధవారం సదరు మహిళకు దుస్తులు అందించారు. దీంతో పోలీస్ సిబ్బందిని పలువురు అభినందించారు.

సీఎం కప్ పోటీల నిర్వహణపై సమావేశం

సోన్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో సురేష్ అధ్యక్షతన సీఎం కప్ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఎంపీవో ఖలీల్ హైమద్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

ఖానాపూర్: దివ్యాంగులను ప్రోత్సహించాలని ఎంఈవో ప్రేంసాగర్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

పీచరలో ఫుడ్ ఫెస్టివల్

లక్ష్మణచాంద: మండలంలోని పీచర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇంటినుంచి వంటకాలు తయారు చేసుకుని వచ్చారు. ప్రధానోపాధ్యాయురాలు గోదావరి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్, ఉపాధ్యాయుడు సుధీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగపుత్రుల నిజాయతీ

బాసర: నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ కుటుంబం బుధవారం బాసర సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చింది. అందులో ఓ భక్తురాలు తన సెల్‌ఫోన్‌ను గోదావరి పుష్కర ఘాట్ వద్ద మర్చిపోయింది. గంగపుత్రులు పోశెట్టి, విఠల్, నాగేశ్‌కు కనిపించడంతో తిరిగి భక్తురాలికి అప్పగించి నిజాయతీ చాటుకున్నారు.

ఆకట్టుకున్న నమూనాలు

మామడ: మండలంలోని కొరిటికల్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులతో పాఠ్యాంశాలకు సంబంధించిన నమూనాల ప్రదర్శన నిర్వహించారు. ఇళ్లు, ఇళ్లలోని అలంకరణ వస్తువులను తయారుచేసి ప్రదర్శించారు. మండల విద్యాధికారి వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ముధోల్: మండల కేంద్రంలోని కేజీబీవీలో తాత్కాలికంగా భౌతికశాస్త్రం బోధించుటకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారి ఫరత్ బేగాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ, బీఈడీ, బీఎస్సీ–బీఈడీ అర్హత గల అభ్యర్థులు ఈ నెల 5 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8978375156 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ముధోల్: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పాటిల్ అన్నారు. బుధవారం మండలంలోని తరోడాలో ఫిష్‌పాండ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులు ఫిష్ పాండ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శివకుమార్, ఎంపీవో శిరీష, ఏపీఎం గురుచరణ్, వీవోఏ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావుపాటిల్

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

ఖానాపూర్: బూటకపు హామీలతో గద్దెనెక్కిన ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షకు హాజరై మాట్లాడారు. రుణమాఫీ, మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత, రైతు భరోసా వంటి హామీలను అమలు చేయకుండా కాలం వెళ్లదీస్తోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలపై ప్రజలు 9240015247 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. అంతకుముందు పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి జగన్నాథ్‌రావు చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, రితీష్ రాథోడ్, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, పార్టీ సభ్యత్వ నమోదు అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్, మండల అధ్యక్షుడు టేకు ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అయ్యన్నగారి భూమయ్య

కృత్రిమ గర్భధారణతో మేలుజాతి దూడలు

కడెం: కృత్రిమ గర్భధారణతో మేలుజాతి దూడలు జన్మిస్తాయని పశుగణాభివృద్ధి సంస్థ ఉమ్మడి జిల్లా అధికారి డా.రామారావు అన్నారు. బుధవారం మండలంలోని కల్లెడలో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశుగర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవాలి పశువులకు మేలురకం వీర్యదానంతో మేలు జాతిదూడలు జన్మించి పాల దిగుబడితో పాటు రైతుల ఆదాయం పెరుగుతుందన్నారు. అనంతరం పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి సౌందర్య, గోపాలమిత్ర సూపర్‌వైజర్ గోపాల్, విజయ డెయిరీ మేనేజర్ వెంకటస్వామి, గోపాల మిత్రలు రమేశ్, మదన్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న అధికారులు

బీఆర్ఎస్‌వీ నిరసన అడ్డగింత

ఖానాపూర్: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థుల మృతి ఘటనలపై బీఆర్ఎస్ విద్యార్థి విభాగం పిలుపు మేరకు బుధవారం చేపట్టిన గురుకులాల బాట నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో పాలకుల వైఫల్యం కారణంగా 900లకు పైగా విద్యార్థులు ఫుడ్‌పాయిజన్‌కు గురై ఆస్పత్రుల పాలయ్యారన్నారు. ఇప్పటికైనా నాణ్యమైన ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహిపాల్, ప్రణీత్, సాయి, వంశీ, అంజి, సంజయ్, రాజ్‌కుమార్, సంతోష్, తిరుమలేశ్, తదితరులు పాల్గొన్నారు.



నాయకులను అడ్డుకుంటున్న ఎస్సై రాహుల్

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

నర్సాపూర్(జి): గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామంలోని డ్రెయినేజీలు, సెగ్రిగేషన్ షెడ్, శ్మశానవాటికలను పరిశీలించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కై లాస్, తదితరులు ఉన్నారు.



వీధులను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

'కాంగ్రెస్‌వి అబద్ధపు హామీలు'

ముధోల్: కాంగ్రెస్‌వి అబద్ధపు హామీలని బీజేపీ ముధోల్ నియోజకవర్గ ప్రోగ్రాం ఇన్‌చార్జి రాజేశ్ బాబు అన్నారు. కాంగ్రెస్ పార్టీ 6 అబద్ధాలు, 66 మోసాలపై బుధవారం చార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మోసగిస్తోందన్నారు. అబద్ధాల కాంగ్రెస్‌పై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో గురువారం భైంసాలో నిర్వహించనున్న బహిరంగసభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధికసంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగ్ రావు, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేశ్‌బాబు

బాసర: మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిందని బీజేపీ నేత రాజేశ్‌బాబు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలను నిరసిస్తూ గురువారం మధ్యాహ్నం భైంసాలో చేపట్టే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలన్నారు.

దివ్యాంగులు దేవుని ప్రతిరూపాలు

సోన్: దివ్యాంగులు దేవుని ప్రతిరూపాలని మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్ అన్నారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో దివ్యాంగులకు క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో భవిత సెంటర్ నిర్వాహకులు సంధ్యారాణి, వికలాంగ విద్యార్థుల ప్రత్యేక ఉపాధ్యాయురాలు స్నేహలత, ప్రధానోపాధ్యాయులు శాంతకుమార్, పోషకులు నారాయణరెడ్డి పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నూతన నియామకం

నర్సాపూర్(జి): మండలంలోని బూరుగుపల్లి (జి)కి చెందిన రాథోడ్ జీవన్‌ను కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా నియమిస్తూ బుధవారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.